క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కనగానపల్లి: బాల్య వివాహాలు చేయటం వల్ల ఆడ పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి



ఇంటి నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్న ఎంపీడీఓ

కదిరి అర్బన్: నిరుపేదలు పక్కా గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పోలప్ప సూచించారు. గురువారం వీరేపల్లిపేట ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. ప్రభుత్వం నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు నివాళులు



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో గురువారం మానవతావాది మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు, ఉపాధ్యాయులు బాబ్జాన్, యోగా గురువు సుబ్బరాయుడు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయ పాలన పాటించరా?



మధ్యాహ్నానికే నిర్మానుష్యంగా ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

పుట్టపర్తి: జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. ఆలస్యంగా విధులకు రావటం.. రెండు మూడు గంటలు సీటులో కూర్చోవడం వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. సాయంత్రం ఐదు గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందించాల్సి ఉండగా మూడు గంటలకే ముగించేస్తున్నారు. క్రయవిక్రయదారులకు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పనులు జరగడం లేదు. సమయ పాలన విషయమై ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ హేమలతను వివరణ కోరగా వింత సమాధానమిచ్చారు. మూడు గంటలకే క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ముగించాలని ప్రభుత్వం చెప్పిందా అని అడిగితే అవునని చెప్పారు.

కక్షల జోలికి వెళ్లొద్దు



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ శ్యామరావు

ముదిగుబ్బ: గ్రామాల్లో కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని రూరల్ సీఐ శ్యామరావు సూచించారు. గురువారం ఆయన ఎస్ఎస్‌పీ కొట్టాలలో గ్రామసభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా చట్ట పరిధిలోనే జీవించాలన్నారు.

బాధ్యతగా పనిచేయండి

ఎన్‌పీకుంట: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ అంజినప్ప సూచించారు. వెలిచలమల సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే పంచాయతీలో చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో కోఆర్డినేట్ సర్వేను పరిశీలించారు.

ఇంటర్ విద్య మిథ్యేనా?



తాడిమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



తరగతి గదిలో ఉన్న విద్యార్థులు



ల్యాబ్‌లో రసాయన పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

- కళాశాలకు శ్యాంక్షన్ కాని లెక్చరర్ పోస్టులు
- నాన్ టీచింగ్ సిబ్బందినీ నియమించలేదు
- కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీలతోనే బోధన

ఇదీ తాడిమర్రి జూనియర్ కాలేజీ దుస్థితి

తాడిమర్రి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్ విద్య మిథ్యగా మారింది. రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో సిలబస్ పూర్తి కాక చతికిలపడుతున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేక బంగారు భవిష్యత్ అంధకారంగా మారుతోంది. మండల కేంద్రం తాడిమర్రికి 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ప్రాథమిక పాఠశాల (బంగ్లాబడి)లో కళాశాలను 100 మందితో ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్, హిస్టరీ ఇలా ప్రతి సబ్జెక్టుకూ ఒకరు చొప్పున మొత్తం 11 మంది అధ్యాపకులు ఉండాలి. అలాగే లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, ఇంకా సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ తదితర బోధనేతర సిబ్బంది కావాలి. అయితే ఒక్క ప్రిన్సిపాల్ మినహా మిగతా ఏ పోస్టులూ శ్యాంక్షన్ కాలేదు. తెలుగు, సివిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు ముగ్గురు కాంట్రాక్టు లెక్చరర్లు ఉన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ కింద మరో ఆరుగురు పాఠాలు బోధిస్తున్నారు. కాలేజీ ప్రారంభమైన ఐదేళ్లలోపు 250 మంది వరకు చదువుకునేవారు. విద్యా ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 68 మంది, ద్వితీయ సంవత్సరంలో 64 మంది మాత్రమే చదువుతున్నారు. ఇక ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. ఆటలు, వ్యాయామం లేక విద్యార్థులు శారీరక దృఢత్వం, మానసిక ఎదుగుదల కోల్పోతున్నారు.

'సర్దుబాటు' చేయొచ్చు

ప్రభుత్వం కళాశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తే శ్యాంక్షన్ పోస్టులను సర్దుబాటు చేయొచ్చని పలువురు అధ్యాపకులు అంటున్నారు. ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు, అనంతపురం (జోన్ 4) జిల్లాల్లోని ఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మిగులుగా ఉన్న అధ్యాపక పోస్టులను ఇక్కడికి సర్దుబాటు చేస్తే కాస్త ఊరట లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

అధ్యాపకులపై అదనపు భారం

అధ్యాపకులకు తరగతిలో సబ్జెక్టుల బోధనతో పాటు నాన్ టీచింగ్ ఉద్యోగులు చేయాల్సిన పని అదనపు భారమవుతోంది. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్లు చేయాల్సిన పనులను రోజుకొక అధ్యాపకులు చేస్తున్నారు. విద్యార్థులను కళాశాలలో చేర్చుకోవడం, అపార్ (విద్యార్థుల సమగ్ర సమాచారం నమోదు), యూడైస్, విద్యార్థుల పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయడం, అధ్యాపకులు జీతాల బిల్లులు పెట్టడం తదితర పనులు అధ్యాపకులకు అదనపు భారంగా మారాయని పలువురు అధ్యాపకులు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి

కళాశాలలోనూ మధ్యాహ్న భోజనం అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఉదయం 9 గంటలకే కళాశాల ప్రారంభం కావడంతో ఇళ్లవద్ద నుంచి క్యారేజీ తెచ్చుకోవడం తీవ్ర ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం లేక కళాశాల వదిలే సమయానికి నీరసించిపోతున్నారు.

లెక్చరర్లను నియమించాలి



కాలేజీలో తగినంతమంది లెక్చరర్లు లేరు. దీంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. మూడు సబ్జెక్టులకు మాత్రమే కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. ఆరుగురు గెస్ట్ ఫ్యాకల్టీలు ఉన్నారు. పాఠ్యాంశాలు సక్రమంగా జరగకపోవడంతో సరిగ్గా చదవలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే తగినంత మంది అధ్యాపకులను నియమించాలి.

– చిరింతాజ్, బైపీసీ, ద్వితీయ సంవత్సరం, తాడిమర్రి

ఎంసెట్‌కు ఎలా ప్రిపేరయ్యేది?



ఎంపీసీలో కీలకమైన మ్యాథ్స్ సబ్జెక్టుకు లెక్చరర్ లేరు. దీంతో సక్రమంగా చదవలేక పోతున్నాం. మరో మూడు నెలల్లో పరీక్షలు రాయాలి. అనంతరం ఎంసెట్ రాయాల్సి ఉంటుంది. పబ్లిక్ పరీక్షలతో పాటు ఎంసెట్‌కు ఎలా ప్రిపేరవ్వాలో అర్థం కావడం లేదు.

– సాయికుమార్, ఎంపీసీ విద్యార్థి, తాడిమర్రి

ఉత్తర్వుల కోసం ఎదురుచూపు



అధ్యాపక పోస్టులకు శ్యాంక్షన్ ఇవ్వాలని ఉన్నతాధికారులకు నివేదించాం. నెల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు కళాశాల సమస్యలపై వినతిపత్రం అందించాం. ఆయన వెంటనే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి అధ్యాపకుల పోస్టులను శ్యాంక్షన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

– డాక్టర్ సురేష్ బాబు, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, తాడిమర్రి

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

గాండ్లపెంట: ప్రభుత్వం ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకిచ్చే రెసిడెన్షియల్ శిక్షణ వల్ల ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారన్నారు. ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్రస్థాయి అధికారుల మొండివైఖరి వీడాలన్నారు. ఉపాధ్యాయులందరికీ అందుబాటులో ఉన్న మండల లేదా డివిజన్ కేంద్రాల్లో శిక్షణ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కదిరి అర్బన్: రెసిడెన్షియల్ శిక్షణతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు షర్ఫోద్దీన్, గౌస్‌లాజమ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒత్తిడితో ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు చనిపోయారని గుర్తు చేశారు. తక్షణమే రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలని, వ్యక్తిగత సెలవులపై పరిమితి విధించకూడదని కోరారు.

ఎన్‌పీకుంట: వివిధ రకాల శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ శిక్షించడం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోతున్నా శిక్షణా తరగతులను రద్దు చేయక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు రామాంజులుయాదవ్, రమణానాయక్, మురళి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం



పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే దంపతుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్ కేశవరెడ్డి, ఓబులపతి తదితరులు



కదిరిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మవరంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య తదితరులు

పుట్టపర్తి/ కదిరిటౌన్/ ధర్మవరం అర్బన్: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి తదితరులు పూలే దంపతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ, రూరల్ కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కౌన్సిలర్ కేశవ, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు రవినాయక్, రమేశ్, నారపరెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, శ్రీరాములు, రామస్వామి నాయక్, అక్కులప్ప, కిష్ట, నాగేంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- కదిరి పట్టణంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్ రాంప్రసాద్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.
- ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య పూలమాల వేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన గొప్ప వ్యక్తి జ్యోతిరావుపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేష్, జంగమన్న, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. ఎల్‌పీ సర్కిల్‌లోనున్న పూలే విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోడల్ స్కూల్లో ఆరోగ్య కార్యక్రమం



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్లో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఎదుగుదల, రక్త పరీక్షలు, చెవుడు, మూగ, వెన్నెముక పరీక్షలను ఎంఈఓ తిరుపాల్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు గాయత్రి, హరిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, నారాయణ ఆశా కార్యకర్తలు సౌందర్య, ఉమా, ప్రభావతి పాల్గొన్నారు.

అపార్ నమోదు 70.71శాతం పూర్తి



ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో ధర్మవరం రెవెన్యూ డివిజన్ 70.71 శాతం పూర్తి చేసిందని ఆర్డీఓ మహేష్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ధర్మవరం మండలంలో 64.9, తాడిమర్రి 79.5, బత్తలపల్లి 74.9, ముదిగుబ్బ 66.7, రామగిరి 67.7, చెన్నేకొత్తపల్లి 65.3, కనగానపల్లి మండలంలో 75.9 శాతం నమోదైందని వివరించారు. త్వరితగతిన వంద శాతం పూర్తి చేసేలా చూస్తామని తెలిపారు.

గుట్టుగా సర్వే.. ఆన్‌లైన్‌లో భూమి తొలగింపు

- మంగళమడకలో సర్వే అధికారుల అక్రమాలు వెలుగులోకి
- న్యాయం కోసం ఉన్నతాధికారులకు బాధితులకు ఫిర్యాదులు



నీళ్లు పెట్టక ఎండిపోతున్న రంగమ్మ మామిడి తోట

పుట్టపర్తి: రెవెన్యూ, సర్వే అధికారుల అక్రమాలు మరోసారి బయటపడ్డాయి. గుట్టుగా సర్వే చేసి.. పట్టాదారు భూమిలో కొంత స్థలాన్ని ఆన్‌లైన్‌లో తొలగించి చేతివాటం ప్రదర్శించారు. బాధితులు న్యాయం కోసం అర్జీలు సమర్పిస్తున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన రంగమ్మకు సర్వేనంబర్ 30–1లో 8 ఎకరాల భూమి ఉంది. ఇది పూర్వపు పట్టా. 70 ఏళ్లుగా ఆ భూమిలో సాగు చేసుకుంటూ వస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం పక్కనున్న రైతు.. సర్వేయర్‌కు డబ్బు ఆశచూపి గుట్టుగా సర్వే చేయించారు. అనంతరం రంగమ్మ పేరిట ఉన్న ఎనిమిది ఎకరాల్లో 57 సెంట్ల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించేశారు. విషయం తెలుసుకున్న వృద్ధురాలైన రంగమ్మ, ఆమె కుమారుడు రంగనాయకులు న్యాయం కోసం అధికారులను ఆశ్రయించారు. స్థానికంగా స్పందన లేకపోవడంతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. 57 సెంట్ల భూమిని అక్రమంగా దక్కించుకున్న రైతు అందులో రాళ్లు, ముళ్ల కంచె వేసేయడంతో కాపుకొచ్చిన మామిడి చెట్లు నీళ్లు లేక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. సర్వే నివేదిక కూడా తమకు తొమ్మిది నెలల తర్వాత ఆర్డీఐ కమిషనర్ కార్యాలయంలో అందాయన్నారు. తమకు జరిగిన అన్యాయంపై మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు మూడు రోజుల క్రితం సర్వేయర్ విజయశాంతి బాయి సమగ్ర విచారణకు ఆదేశించారు.

ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి తగదు

పుట్టపర్తి: ఉపాధ్యాయులకు నిల్వ ఉన్న సెలవుల (ఆరోగ్య, సాధారణ సెలవుల)పై పరిమితి (ఆంక్షలు) విధించటం అన్యాయమని వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, ఇంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెలవులపై ఆంక్షల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అవసరాలకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు సంవత్సరం చివరలో సెలవులు వాడుకోవాలని భావిస్తుంటారని, ఇది అనేక ఏళ్లుగా కొనసాగుతున్నదేనని తెలిపారు. ప్రభుత్వం సానుకూల ధోరణితో వ్యవహరించాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



పూత దశకు వచ్చిన కంది పంట

బత్తలపల్లి: కంది సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దాదాపు 6,000 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడంతో సకాలంలో వర్షాలు రావడం వల్ల ప్రస్తుతం పూత దశకు చేరుకుందన్నారు. కొన్ని స్వల్పకాలిక రకాల్లో కాపు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ దశలో పురుగు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తొలిదశలో వచ్చే పూత మొత్తం పురుగుల బారినపడి రాలిపోతుందన్నారు. తర్వాత వచ్చే పూత ద్వారా మాత్రమే దిగుబడి వస్తుందన్నారు.

వేరుశనగకు గిట్టుబాటు ధర కరువు



రైతు ఇంట్లో నిల్వ ఉన్న వేరుశనగ కాయలు

నల్లమాడ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక దిగుబడులను అమ్ముకోవడానికి వ్యాపారుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా రైతన్నలు మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చౌటకుంటపల్లిలో 15 మంది రైతులు నిత్య హరిత రకం వేరుశనగ పంట సాగుచేశారు. అప్పట్లో వేరుశనగ విత్తనాలు కిలో రూ.100తో కొనుగోలు చేసి సేద్యం, విత్తనసాగు, ఎరువులు, నూర్పిడి ఖర్చులతో కలిపి ఒక ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. నెల క్రితం వేరుశనగ పంట నూర్పిడి చేశారు. అప్పటి వరకు 44 కిలోల బస్తా వేరుశనగ కాయలు మార్కెట్‌లో రూ.3,200 ధర ఉండగా ఉన్నఫళంగా ధర సగానికి పడిపోయింది. అప్పటికీ కాయలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు కాయలను ఇళ్లకు తరలించి భద్రపర్చారు.

పెట్టుబడి దక్కని వైనం

ఎకరాకు రూ.30 వేలు పైబడి పెట్టుబడి ఖర్చు చేశామని, ప్రస్తుతం బస్తా రూ.2 వేలతో విక్రయించినా పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారు. అయితే రైతులు పండించిన వేరుశనగ కాయలకు గిట్టుబాటు ధర లేకపోగా అదే పంట సాగు చేయాలంటే వేరుశనగ విత్తనాలు మార్కెట్‌లో కిలో రూ.120 ధర పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో తమ పరిస్థితి కొనబోతే కొరివి..అమ్మబోతే అడవి అన్న చందంగా తయారైందని నిట్టూరుస్తున్నారు. రూ.మూడు, నాలుగు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు ఊసే లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని రకాల పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ



కార్మికులకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న అధికారులు

ముదిగుబ్బ: తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, జీతం పెంచాలని ముదిగుబ్బ మేజర్ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎనిమిది రోజులుగా చేపట్టిన సమ్మెను గురువారం తాత్కాలికంగా విరమించారు. 2016కు ముందు నుంచి పనిచేస్తున్న 14 మందికి జీతాలు పెంచుతున్నట్లు జారీ అయిన ఉత్తర్వులను అధికారులు అందజేశారు. మిగిలిన తొమ్మిది మందికి మలి విడతలో ఉత్తర్వులు వస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం నాయకులు పోతులయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అర్హులను గుర్తించండి



సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ సాయి మనోహర్

ధర్మవరం రూరల్: గ్రామాల్లో సర్వే చేసి, పరిశ్రమలు స్థాపించడానికి అర్హులైన వారిని గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సాయి మనోహర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం అర్హులైన వారిని గుర్తించేందుకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత సమాజానికి సృషి



బుక్కపట్నంలో కొవ్వొత్తులతో ర్యాలీ

పుట్టపర్తి: బాల్య వివాహాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కౌసల్యాసాయి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తేరు కూడలిలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పుర వాసులతో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాల వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

రత్నాకర్‌ను కలిసిన కురుబ కార్పొరేషన్ డైరెక్టర్



రత్నాకర్‌ను సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బలుగుండ్ల శ్రీనివాసులుతో పాటు, కురుబ సంఘం నాయకులు గురువారం పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజును మర్యాద పూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించారు. కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి వన్నె తేవాలని, కురుమ సామాజికవర్గం వారి అభ్యున్నతికి పాటుపడాలని రత్నాకర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ, కేశాని ఆదినారాయణ, బందారు రమేష్, బిల్లే సూరి, శివశంకర్, బాబయ్య, తిప్పన్న, జయరామ్, విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగుల ప్రతిష్ట

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద నిర్మించిన గుడిలో గురువారం నాగుల ప్రతిష్ట కార్యక్రమం అర్చకులు గోపీనాథ్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అయ్యప్ప విగ్రహం ఏర్పాటుకు నిధి సేకరణ



నిధి సేకరణ చేస్తున్న గురుస్వామి, అయ్యప్పమాలధారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహం ఏర్పాటు కోసం నిధి సేకరణ చేస్తున్నట్లు గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం లోనికోట, బసవన్నకట్టవీధి, చౌడేశ్వరి దేవాలయం, యాదవవీధి, చెన్నకేశవస్వామి ఆలయం, మార్కండేయస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో గురుస్వామి అయ్యప్పమాలధారులు నిధి సేకరణ చేపట్టారు. దాతలు ముందుకు వచ్చి అయ్యప్ప స్వామి విగ్రహం ఏర్పాటు కోసం తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.